క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ తదితరులు

లావేరు: చినమురపాక గ్రామంలో నూతనంగా సువర్చాలా ఆంజనేయస్వామి మందిరాన్ని నిర్మించి ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదివారం ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు సిరిపురపు రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె వెంకటప్పలనాయుడు, ఎం .రమణ ఉన్నారు.

వైభవంగా త్రిశూల తీర్థ స్నానం



త్రిశూల తీర్థ స్నానాలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని గుడివీధిలో గల ఉమారుద్రకోటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా ఆదివారం 'త్రిశూల తీర్థ' స్నానాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో జ్యేష్ఠశుద్ధ పౌర్ణమి సందర్భంగా ఉమాసమేత రుద్రకోటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు నాగవెల్లి పూజలు చేపట్టారు. అనంతరం ఉత్సమూర్తులను పల్లకిలో ఉంచి ప్రధాన ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణలు చేసి, ఊరేగింపుగా నాగావళి నదీ తీరానికి చేర్చి అక్కడ పూజలు చేశారు. నదిలోనికి ఉత్సమూర్తులను తీసుకెళ్లి త్రిశూల తీర్థ స్నానాలు నిర్వహించారు.

సుదర్శన క్రియతో మానసిక ఒత్తిడి మాయం



మాట్లాడుతున్న ఆర్ట్ ఆఫ్‌లివింగ్ ప్రతినిధి జగదీశ్‌శాస్త్రి

శ్రీకాకుళం కల్చరల్: రవిశంకర్ గురుజీ చెప్పిన సుదర్శన క్రియ వల మానసిక ఒత్తిడి, మన శ్శాంతి, మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని జగదీశ్‌శాస్త్రి అన్నారు. స్థానిక ప్రహ్లాద కల్యాణ మండపంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా ధ్యాన శిబిరంలో సాధకులు మూడురోజులుగా నిర్వహించిన మౌనంలో పాల్గొన్నారు. ఆదివారం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుజీ చెప్పిన హ్యాపీనెస్ కార్యక్రమంలోనే అందరూ సంతోషంగా జీవిస్తారన్నారు. డాక్టర్ కె.అమ్మన్నాయుడు, జి.శంకరరావు, ఎన్.కల్పన, వి.సందీప్, కె.రేణుక, కె.గోవిందరావు, ఎస్.రాంబాబు, ఝాన్సీ, కోఆర్డినేటర్ కె.ఎస్.ఎన్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా తెరవే సాహితీ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న కవులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని తెలుగు రచయితల వేదిక 81వ సమావేశం (సాహితీ సమ్మేళనం) శాంతి నికేతన్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. తెరవే అధ్యక్షుడు యు.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ సభ ఏర్పాటు చేశారు. కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు కవితలను చదివి వినిపించారు. ఐ.ఎస్.డి.ప్రసాద్, డాక్టర్ నిక్కు అప్పన్న, జి.గోపాలకృష్ణ, డాక్టర్ ఉపేంద్రశర్మ, నిక్కు హరిసత్యనారాయణ, ఇద్దిపాపయ్య పాల్గొన్నారు.

ఉమాకవికి రోటరీ గవర్నర్ ప్రశంస



ఉమాకవిని అభినందిస్తున్న రోటరీ గవర్నర్ భాస్కరరామ్

శ్రీకాకుళం అర్బన్: సాహితీ చైతన్య కిరణాలు అధ్యక్షుడు భోగెల ఉమామహేశ్వరరావు (ఉమాకవి) వనం-మనం కవిత చదివినందుకు, పర్యావరణం కాపాడాల్సిన అవసరం ఉందని నినాదాలతో కూడిన కవిత చదివినందుకు రోటరీ గవర్నర్ వి.భాస్కరరామ్ ఆదివారం ప్రశంసించారు. ఈ సందర్భంగా వనం-మనం దీర్ఘ కవితను గవర్నర్ చేతులు మీదుగా ఆవిష్కరించారు. రోటరీ క్లబ్ సహాయ గవర్నర్ ఎం.ఆర్.కె దాస్, గీతాశ్రీకాంత్, డి.శివశంకర్, వరదా గోవిందరాజులు, కింతలి నాగేశ్వరరావు, సాధు శంకరరావు, అన్నెపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రలకు
స్పెషల్ సర్వీసులు

- ఆర్టీసీ డీపీటీఓ విజయ్‌కుమార్



శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ఆర్టీసీ శ్రీకాకుళం ఆధ్వర్యంలో ఈ నెల 10, 17వ తేదీల్లో భీమునిపట్నం బీచ్ నుంచి బొర్రా గృహలకు సంబంధించి స్పెషల్ సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీపీటీఓ ఎ.విజయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ బస్సులు శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి ఉదయం 9 గంటలకు బయలుదేరి భీమునిపట్నం బీచ్, కైలాసగిరి, తిరుపతి దేవస్థానం దర్శింప చేసి, ఎస్.కోట మీదుగా అరుకు వెళ్లి.. అరకులో రాత్రి బస చేస్తాయన్నారు. విహార యాత్రికులకు అరుకులో లాడ్జింగ్, డిన్నర్ ఏర్పాటు చేస్తామన్నారు. మరుసటి రోజు ఉదయం 8 గంటలకు బయలుదేరి పద్మావతి గార్డెన్స్, ట్రైబల్ మ్యూజియం, కాఫీ హౌస్, బొర్రా గృహలు చూపించి సాయంత్రం 6 గంటలకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంటుందన్నారు. ఒక్కొక్క ప్రయాణికుడికి రూ.2,500 చార్జి నిర్ణయించినట్లు తెలిపారు.


గోపాలపురం బీచ్–చిలక సరస్సు..

శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి ఈ నెల 10, 17 తేదీల్లో ఉదయం 6 గంటలకు బయలుదేరి గోపాలపురం బీచ్.. అక్కడ నుంచి చిలక సరస్సులో గల ప్రసిద్ధ మహా కాళీ ఆలయాన్ని దర్శింపజేస్తామన్నారు. మరలా సాయంత్రం 6 గంటలకు బయలుదేరి శ్రీకాకుళం కాంప్లెక్స్‌కు చేరవేస్తామన్నారు. ఈ యాత్రకు సంబంధించి ఒక్కొక్క ప్రయాణికుడికి రూ.1,500 చార్జి నిర్ణయించామన్నారు.

పూరి జగన్నాథ రథయాత్రా స్పెషల్..

పూరి జగన్నాథ రథయాత్ర సందర్భంగా ఈ నెల 19వ తేదీ సోమవారం శ్రీకాకుళం నుంచి ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారని తెలిపారు. ఈ యాత్ర 19వ తేదీ రాత్రి 8 గంటలకు శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి బయలుదేరి 20వ తేదీ ఉదయం 6 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుందన్నారు. అక్కడ కాల కృత్యాలు తీర్చుకొని భువనేశ్వర్‌లో గల లింగరాజు ఆలయాన్ని దర్శింపజేసి.. అక్కడ నుంచి 10 గంటలకు కోణార్క్ సూర్య దేవాలయం దర్శింపజేస్తామన్నారు. అనంతరం పూరియాత్రకు సాయంత్రం నాలుగు గంటలకు చేర్చుతామన్నారు. మరలా రథయాత్ర అనంతరం రాత్రి 9 గంటలకు పూరి నుంచి బస్సు బయలుదేరి 21వ తేదీ ఉదయం శ్రీకాకుళం కాంప్లెక్స్‌కు చేరుకుంటుందన్నారు. ఈ యాత్రకు సంబంధించి ఒక్కొక్క ప్రయాణికుడికి చార్జి రూ.2,200 నిర్ణయించినట్లు పేర్కొన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్‌టీసీఆన్‌లైన్.ఇన్‌లో కూడా టిక్కెట్‌లు లభిస్తాయన్నారు. మరిన్ని వివరాలకు 73829 21647, 99592 25608, 99592 25609, 73829 17289, 73829 19694 సంప్రదించవచ్చన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో సత్తా





పాలవలస కృష్ణమోహన్ | గుడ్ల హిమజ | తూము బానుతేజ

శ్రీకాకుళం: జాతీయ స్థాయి ప్రతిభా పరీక్ష (ఎన్ఎంఎంఎస్)లో 2023 సంవత్సరంలో వరం మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. గుడ్ల హిమజ, తూము బానుతేజ, పాలవలస కృష్ణమోహన్ ఎంపికయ్యారు. వీరికి ఇంటర్ చదువు పూర్తయ్యేంత వరకు ప్రభుత్వ సంస్థల్లో చదివితే ఏడాదికి రూ.12 వేలు ప్రభుత్వమే ఆర్థిక సహాయాన్ని అందజేస్తుంది. విద్యార్థులను హెచ్‌ఎం పి.ఇందిరామణి, పాఠశాల వ్యవస్థాపకులు, వరం కుటుంబ సభ్యులు అంధవరపు ప్రసాద్, సంతోష్, పాఠశాల కమిటీ సభ్యులు మళ్ల శ్రీనివాస చక్రవర్తి, కిల్లంశెట్టి అరుణ్‌కుమార్ గుప్తా, కడపల కృష్ణవేణి, ఎడ్ల వెంకటరావు తదితరులు అభినందించారు.

ఇద్దరు ఎంపిక..




ఉదయ్‌కుమార్ | పూర్ణిమ

జి.సిగడాం: నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు (ఎన్ఎంఎంఎస్) జి.సిగడాం ఆదర్శ పాఠశాలకు చెందిన కెల్ల ఉదయ్‌కుమార్, సువ్వాడ పూర్ణిమ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యుల్ లెంక ఆదివారం తెలిపారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల
బైక్‌ర్యాలీ



బైక్ ర్యాలీ చేస్తున్న దృశ్యం

లావేరు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కంది నాని ప్రజలను కోరారు. ఆయన ఆధ్వర్యంలో మండలంలో ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. సుభద్రాపురం నుంచి వెంకటాపురం గ్రామం వరకూ సాగిన ర్యాలీలో అధికసంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి.

ఆదిత్యాలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



ఈఓ హరిసూర్యప్రకాష్‌కు చెక్కు అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం స్థానికులైన ఎం.శశిభూషణరావు, మీనాక్షి దంపతులు రూ.1,00,116 విరాళంగా సమర్పించారు. ఈ మేరకు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్‌కు ఆదివారం చెక్కును అందజేశారు. ఈఓ మాట్లాడుతూ ఆలయంలో ఇటీవల కాలంలో దాతల ప్రోత్సాహంతోనే పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అందుకు తగిన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, నేతేటి హరిప్రసాదశర్మ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిక కులస్తులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న రెడ్డిక సంక్షేమ సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన రెడ్డిక కులస్తులకు జిల్లాలో ఏదో ఒక నియోజకవర్గంలో ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని రెడ్డిక సంక్షేమ సంఘం నాయకులు కోరారు. శ్రీకాకుళం నగరంలో ఓ ప్రైవేట్ హోటల్‌లో రెడ్డిక సంఘ నాయకులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ అన్ని ప్రధాన పార్టీలు రెడ్డికలను గుర్తించి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరారు. రానున్న రోజుల్లో అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించి రెడ్డిక సామాజిక వర్గం తరఫున ప్రజలను ఏకం చేస్తామన్నారు. 2024 ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేసేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు బల్లాడ జనార్దన రెడ్డి, సాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, దూడ విష్ణుమూర్తి రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ అలపాన త్రినాథ రెడ్డి, పాల వసంతరెడ్డి, పైల దేవదాస్‌రెడ్డి, దుక్క లోకేశ్వరెడ్డి, చాట్ల తులసీదాస్‌రెడ్డి, భోజరాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథుడుకి జ్యేష్టాభిషేకాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలో గల జగన్నాథస్వామి ఆలయంలో జ్యేష్టాభిషేకాలు, స్వామివారి నేత్ర బంధం దర్పణ ప్రాణ ప్రతిష్ఠ ఆదివారం జరిగింది. ఆలయ అర్చకులు, పెంట వంశీయులు పూజలు నిర్వహించారు. స్వామి యోగ నిద్రలోని వెళ్తారని, ఆషాఢ శుద్ధ పాఢ్యమినాడు మేలుకొంటారని అర్చకులు తెలిపారు.

రోటరీ సేవల్లో అందరినీ భాగస్వామ్యం చేయండి

- రోటరీ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ భాస్కరరామ్



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: రోటరీ సేవా కార్యక్రమాల్లో అందరినీ భాగస్వామ్యం చేయాలని రోటరీ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ వి.భాస్కరరామ్ అన్నారు. రోటరీ గవర్నర్ అధికారిక పర్యటన కార్యక్రమంలో భాగంగా రోటరీ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రోటరీ ఉత్తర సేవ పురస్కారం 2022-23, కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో పోలియో శాశ్వత నిర్మూలనకు ఇప్పటివరకు రూ.40 వేల కోట్లు వివిధ అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థల సహకారంతో ఖర్చు చేశామన్నారు. రోటరీ సేవలు గురించి ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించాలన్నారు. రోటరీ సేవా కార్యక్రమాల్లో సమాజంలోని ఉన్నత, మధ్య తరగతి, విద్యావంతులను గుర్తించి భాగస్వామ్యపరచాలని, తద్వారా రోటరీ అంతర్జాతీయ సంస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. కరోనా మహమ్మారి సమయంలో కూడా రోటరీ క్లబ్‌లు ఎంతోమంది నిర్భాగ్యులకు సేవలు అందించిందని గుర్తు చేశారు. మహిళా సాధికారత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, అసంక్రమణ వ్యాధుల పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించడం, ఆరోగ్యవంతమైన జీవన విధానం లక్ష్యంగా రోటరీ అంతర్జాతీయ సంస్థ పనిచేస్తుందన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ధర్మాన టీవీఎస్ మోటార్స్ జనరల్ మేనేజర్ సాధు శంకరరావు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ అందులో భాగంగానే రోటరీ అంతర్జాతీయ సంస్థతో కలిసి సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనంతరం క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అన్నెపు సత్యనారాయణ, బరాటం శ్రీనివాసులు ధర్మాన టీవీఎస్ వారి సౌజన్యంతో 26 మంది మహిళలకు కుట్టు మిషన్లు, దివ్యాంగులకు 10 వీల్ చైర్లు, విద్యార్థినులకు 3 సైకిళ్లు అందజేశారు. క్లబ్ సహాయ గవర్నర్ ఎం.ఆర్.కె.దాస్, దేవరశెట్టి శివశంకర్, మంత్రి వెంకట స్వామి, డాక్టర్ వై.గీతాశ్రీకాంత్, ఆమదాలవలస సహాయ గవర్నర్ వెంకుబాబు, రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు కింతలి నాగేశ్వరరావు, రోటరీ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వరదా గోవిందరాజులు, డాక్టర్ కె.సోమేశ్వరరావు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అవార్డ్ గ్రహీతలు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి



కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: మూడురోజుల క్రితం ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి పలువురు ప్రముఖులు ఆదివారం నివాళులర్పించారు. కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న చిల్డ్రన్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. నటుకుల మోహన్, నిక్కు హరిసత్యనారాయణ, గుత్తు చిన్నారావు, ఎల్.నందికేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

90 శాతం సబ్సిడీపై వలలు, బోట్లు ఇవ్వాలి



మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ గురువులుకు వినతి పత్రం అందిస్తున్న కోనాడ నర్సింగరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటుతనంలో ఉన్న మత్స్యకారులకు 90 శాతం సబ్సిడీతో వలలు, బోట్లు అందించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ చూపాలని మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులుకు మత్స్యకార సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కోనాడ నర్సింగరావు కోరారు. ఈ మేరకు ఆదివారం విశాఖపట్నంలోని చైర్మన్ గృహంలో కలిసి వినతిపత్రం అందించారు. మత్స్యకారులను అత్యంత వెనుకబడిన కులంలో (ఎంబీసీ)లో చేర్చేలా చూడాలన్నారు. వేటకు వెళ్లేవారికి ఇంజిన్ బోట్లకు ఆయిల్ సబ్సిడీ రూ.9 నుంచి రూ.15కి పెంచేలా చూడాలన్నారు. వినతిపత్రం అందించినవారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు దుమ్ము శ్రీధర్ ఉన్నారు.

విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



రణస్థలం: చిత్రలేఖనం పోటీలో విద్యార్థులు

లావేరు: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మురపాక గ్రామంలోని గ్రంథాలయంలో విద్యార్థులతో ఆదివారం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పిల్లలు డ్యాన్సులు, ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం గ్రంథాలయం ఆవరణను శుభ్రం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు, సహాయకుడు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ఆటలతో ఉల్లాసం, ఉత్సాహం లభిస్తోందని ధర్మవరం గ్రంథాలయాధికారి ఎం.చంద్రశేఖరరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పిల్లలతో ఆటలాడించారు. కార్యక్రమంలో సహాయకుడు బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

రణస్థలం: విద్యార్థులు పుస్తక పఠనంతో పాటు చిత్రలేఖనంలో రాణిస్తే సృజనాత్మకమైన ఆలోచనలు లభిస్తాయని రణస్థలం శాఖా గ్రంథాలయాధికారిణి పి.వరలక్ష్మి అన్నారు. దిన పత్రికలు, కథల పుస్తకాలు చదివించడం, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. పిల్లలు చిన్నప్పటి నుంచి లక్ష్యాన్ని పెట్టుకొని చదవాలన్నారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

జి.సిగడాం: పెంట గ్రామంలోని కనకదుర్గ అమ్మవారికి భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయం నిర్మాణానికి ఆర్థికసాయం చేసిన వారిని కమిటీ సభ్యులు సత్కరించారు.

జస్టిస్ గురుగుబెల్లికి సత్కారం



జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులును సన్మానిస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, నీలం సంజీవరెడ్డి న్యాయ శిరోమణి గౌరవ పురస్కార గ్రహీత జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులును నారాయణ తిరుమల క్షేత్రం వద్ద గల ఆయన స్వగృహంలో పలువురు న్యాయవాదులు ఆదివారం సన్మానించారు. యతిరాజులకు అరుదైన, గౌరవప్రదమైన నీలం సంజీవరెడ్డి న్యాయ శిరోమణి గౌరవ పురస్కారం రావడం పట్ల న్యాయవాదులు సంతోషం వ్యక్తం చేశారు. న్యాయవాదులు మట్లాడుతూ జిల్లాలో చదివి, న్యాయవాదిగా వృత్తిని చేపట్టి, జిల్లా జడ్జిగా ఎంపికై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా పనిచేశారన్నారు. ఎన్నో సంస్థలకు, ఎంతో మందికి మార్గదర్శిగా ఉన్న యతిరాజులు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గురుగుబెల్లి మట్లాడుతూ ఏ వృత్తిలోనైనా, ఏ రంగంలోనైనా కష్టపడి పని చేస్తే తప్పనిసరిగా మంచి ఫలితాలు వస్తాయన్నారు. తన తండ్రి ప్రోత్సహంతోనే లా కోర్సు పూర్తి చేశానని, పట్టుదలతో చదవడం వల్లే హైకోర్టు జడ్జిగా ఉన్నత స్థానంలో నిలిచానన్నారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, బీసీ న్యాయవాదుల జిల్లా అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, న్యాయవాదులు కూన అన్నంనాయుడు, బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి.. పింఛన్ అందజేసి..



లావేరు: రమణమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఉమ



జి.సిగడాం: సూర్యనారాయణకు కిడ్నీ పింఛన్ అందజేస్తున్న దృశ్యం

లావేరు: సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. వెంకటాపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు పిసిని రమణమ్మ అనారోగ్య సమస్యతో శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో అమె గ్రామంలో వృద్ధాప్య పింఛన్ డబ్బులు తీసుకోవడానికి వీలు కాలేదు. విషయం తెలియడంతో వలంటీరు ఎస్.ఉమ ఆదివారం ఆస్పత్రికి వెళ్లి రమణమ్మతో వేలిముద్రలు వేయించి పింఛన్ అందజేశారు.

కిడ్నీ పింఛన్..

జి.సిగడాం: మండల కేంద్రానికి చెందిన ఎం.సూర్యనారాయణకు కిడ్నీ పింఛన్ రూ. పది వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని సర్పంచ్ ముద్దాడ గౌరీ, సచివాయం కన్వీనర్ తొత్రోతు సురేష్, హరి, వైఎస్సార్‌సిపి నాయకులు మజ్జి రమణ, అలపాన శ్రీనివాసరావురెడ్డి సమక్షంలో సూర్యనారాయణకు ఆదివారం అందించారు. పంచాయతీ కార్యదర్శి సాహు, డిజిటల్ అసిస్టెంట్ పొగిరి రాము పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నమోదుపై సర్వే



జె.ఆర్.పురంలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

రణస్థలం: వైఎస్సార్ బీమా నమోదుపై గ్రామాల్లో సర్వే చేపడుతున్నామని ఎంపీడీవో వి.ధనుంజయ రావు ఆదివారం తెలిపారు. ఈ నెల ఏడో తేదీలోగా సర్వే పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఎవరైన బీమాలో పేర్లు నమోదు చేయించుకుపోతే త్వరగా చేయించుకోవాలని సూచించారు. బీమా ఉన్నవారిలో 18–50 ఏళ్లలోపు సహజ మరణమైతే కుటుంబ పెద్దకు రూ. లక్ష, 18–70 ఏళ్లలోపు వయస్సు ఉండి ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత వైకల్యం చెందినా రూ. 5 లక్షలు ప్రభుత్వం అందజేస్తోందన్నారు. బీమాకు సంబంధించి ఏటా జూన్ నెలలో సర్వే పూర్తి చేయడం తప్పనిసరన్నారు. వైఎస్సార్ బీమా పథకాన్ని 2021 జూలై ఒకటో తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించినట్టు పేర్కొన్నారు. బీమా కంపెనీలు, బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా గ్రామ సచివాలయాల ద్వారానే పరిహారం చెల్లింపును ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు.

7 నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో గల భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు, ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7న స్వామివారికి కల్యాణం, 8న నారాయణ సేవ, సామూహిక కుంకుమార్చనలు, కోలాటం ప్రదర్శన, 9న స్వామివారికి పుష్పయాగ మహోత్సవం, భక్తి సంగీత విభావరి జరుగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.